విహారయాత్రలో అసెంబ్లీని సందర్శించిన లయోలా స్కూల్ విద్యార్థులు

విశ్వంభర, ఎల్బీనగర్ : సరూర్‌నగర్‌లోని లోయోలా ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం నాంపల్లిలో నీ తెలంగాణ రాష్ట్ర శాసనసభ, రాష్ట్ర శాసన మండలి, రాష్ట్ర మ్యూజియంకు విజ్ఞానదాయకమైన పర్యటనకు బయలుదేరారని కరస్పాండెంట్ ఎంఐ గుల్షాని, లయోలా ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ కె.హర్షిత పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పర్యటనలో భాగంగా భవిష్యత్ తరాలకు స్ఫూర్తి పొందే విధంగా విద్యార్థులను తయారు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వ పాలన అనే అంశంపై అవగాహన కల్పించడానికి పరిపాలన, చరిత్ర, సాంస్కృతిక వారసత్వ సంపద గురించి ప్రత్యక్ష అనుభవాన్ని అందించడం జరిగిందన్నారు. యువ విద్యార్థులలో పౌర చైతన్యాన్ని పెంపొందించడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమన్నారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభ, రాష్ట్ర శాసన మండలి, రాష్ట్ర మ్యూజియంకు విజ్ఞానదాయకమైన పర్యటనలో సందర్శించిన విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయోలా ఉన్నత పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఉదయరాణి, అకడమిక్ ఇన్‌చార్జ్ రాధిక, అకౌంట్స్ విభాగం, ఉపాధ్యాయులు ఫాతిమా బేగం, సత్యవతి, శ్రావంతి, రేష్మా బేగం, కెమెరామెన్ ప్రవీణ్ కుమార్, ఎం.జతిన్ కుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాక్‌జాన్సన్ ఈవెంట్‌పై పోలీసుల నిఘా.. సినీనటులకు డ్రగ్స్ పరీక్షలు



విశ్వంభర, హైదరాబాద్: జాక్‌జాన్సన్ ఈవెంట్‌పై నిఘాపెట్టిన ఈగల్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు తారామతి రిసార్ట్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈవెంట్‌లో పలువురు సినీనటులు పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. మొత్తం 35 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. ఆరుగురికి పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

ఏఐవిఎఫ్ జాతీయ సలహాదారుడిగా పుండరీ చారి నియామకం

విశ్వంభర, హైదరాబాద్: ఆల్ ఇండియా శ్రీ విరాట్ విశ్వకర్మ ఉమెన్ అండ్ యూత్ ఫెడరేషన్ (ఏఐవిఎఫ్) జాతీయ సలహాదారుడిగా, తెలంగాణ రాష్ట్ర మీడియా వింగ్ కోఆర్డినేటర్‌గా సీనియర్ జర్నలిస్టు జూలూరు పుండరీ చారి నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ జాతీయ వ్యవస్థాపకుడు జైన్ కుమార్ విశ్వకర్మ, జాతీయ ప్రధాన కార్యదర్శి చిన్నయ్య జగదీష్ ఆచారి నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు జాతీయ కార్యదర్శి వి ఎం లక్ష్మీనరసింహ సేనా చారి తెలిపారు. మూడు సంవత్సరాల పాటు ఈ బాధ్యతలు నిర్వర్తించ నున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్థను దేశవ్యాప్తంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. విశ్వకర్మల ఏకతను పెంపొందించి, యువత, మహిళల్లో రాజకీయ చైతన్యం తీసుకు రావడంపై దృష్టి సారిస్తానన్నారు. చేతివృత్తుల ఆధునికీకరణతో పాటు విశ్వకర్మలకు పూర్వ వైభవం తీసుకురావాలని, సెప్టెంబర్ 17ను శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతిగా అధికారిక సెలవుదినంగా ప్రకటించాలని కోరారు.

ఫార్మా ఎగుమతుల బలోపేతానికి కేంద్రం సహకారం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: భారత ఫార్మా రంగాన్ని బలోపేతం చేసే దిశగా హైదరాబాద్‌లో శనివారం ఉన్నతస్థాయి చింతన్ శివిర్ నిర్వహించారు. కేంద్ర వాణిజ్య శాఖ, ఫార్మెక్సిల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశీయ ఫార్మా అవసరాల్లో 90 శాతం స్వదేశీ ఉత్పత్తి ద్వారానే తీర్చుకోవాలని, ఏపీఐలు, బల్క్ డ్రగ్స్ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని సూచించారు. 60 బిలియన్ డాలర్ల విలువైన భారత ఫార్మా పరిశ్రమలో సగం వాటా ఎగుమతులదేనని, నాణ్యతతో కూడిన ఆవిష్కరణల ద్వారా భారత్ ప్రపంచపు ఫార్మసీగా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకోవాలని పిలుపునిచ్చారు. బయోఫార్మా రంగాన్ని బలోపేతం చేసేందుకు రూ. 10,000 కోట్లతో ప్రవేశపెట్టిన బయోఫార్మా శక్తి పథకం ఇందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఇదే వేదికపై సెప్టెంబర్ 7 నుండి 9 వరకు జరగనున్న ఐపెక్స్ 2026 ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. సమావేశంలో ఫార్మెక్సిల్ ప్రతినిధులు, పరిశ్రమల ప్రముఖులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ రాజర్షి షా సమీక్ష

విశ్వంభర, ఆదిలాబాద్ : రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 6న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, ఏర్పాట్లను అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆయన పలు ఆదేశాలు, సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రారంభోత్సవాలు, శిలాఫలకాల ఆవిష్కరణ వద్ద ప్రోటోకాల్ పాటించాలని, కేటాయించిన విభాగం వద్దనే ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉండాలని స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు చెక్కుల పంపిణీ, ఇతర సర్టిఫికేషన్ అందజేత వంటి కార్యక్రమాలను నిర్దీత సమయంలోగా, క్రమశిక్షణతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వేదిక వద్ద తాగునీరు, సీటింగ్. పార్కింగ్, ఇతర ఏర్పాట్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ ప్రవంతి, డిఆర్డీఓ రవీందర్, వివిధ శాఖల ఈఈలు, తహశీల్దార్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ

- ప్రైవేట్ మాదిరిగా రవాణా సౌకర్యం : సీఎం రేవంత్ రెడ్డి
- ఇబ్రహీంపట్నంలో ఏవీఎన్ లేక్ ఫీల్డ్ గ్లోబల్ స్కూల్ ప్రారంభించిన సీఎం
- పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



విశ్వంభర, హైదరాబాద్ : ప్రభుత్వం విఫలమైనందుకే తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేట్ విద్యాసంస్థలకు పంపిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. విద్య అందరికీ అందుబాటులో ఉన్నప్పటికీ నాణ్యత ఉండటం లేదన్నసీఎం రేవంత్ రెడ్డి, ఆరో తరగతి విద్యార్థులు మూడో తరగతి పుస్తకం చదవలేక పోతున్నారన్నారు. పట్టాలు తప్పిన విద్యా వ్యవస్థను గాడిన పెట్టేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ ప్రయత్నించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రవాణా సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. ఏఐ సునామీతో వైట్ కాలర్ ఉద్యోగాలు పోతున్నందున, ప్రత్యామ్నాయంగా మరిన్ని బ్లూ కాలర్ జాబ్‌లు సృష్టించాలన్నారు. విద్యపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి విద్యార్థిపై రూ.లక్ష 8 వేలు ఖర్చు చేస్తోందని, బడ్జెట్‌లో 8.3 శాతం నిధులు కేటాయించిందని సీఎం వివరించారు. అయితే విద్య అందరికీ అందుబాటులో ఉన్నప్పటికీ నాణ్యత లోపించిందని ముఖ్యమంత్రి అన్నారు. ఏఐ తుపానులో వైట్ కాలర్ జాబ్‌లు పోతున్నాయని, దేశ భవిష్యత్తు, ఆర్థిక వ్యవస్థ ప్రమాదం వైపు వెళ్తోందన్నారు. రాష్ట్రంలో ఏటా లక్ష 10 వేల మంది ఇంజినీరింగ్ పూర్తి చేస్తున్నప్పటికీ, సర్టిఫికెట్‌కు తగిన అవగాహన ఉండటం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఆరో తరగతి విద్యార్థుల్లో మూడో తరగతి పుస్తకం చదవలేకపోతున్నట్లు సర్వేలో తేలిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ ఎక్కడ గాడి తప్పింది? ఎలా విఫలమైందో రాజకీయాలకు అతీతంగా అందరూ ఆలోచించాలని ముఖ్యమంత్రి కోరారు. వెనకబాటుతనానికి కారణం చదువులేక పోవడమేనని, పేదరికం కాదని ఇటీవల రాష్ట్రంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో తేలిందని సీఎం తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రైవేట్ స్కూళ్ల తరహాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రవాణా ఏర్పాట్లు చేయనున్నట్లు సీఎం చెప్పారు. ఇబ్రహీంపట్నంలో ఏవీఎన్ లేక్‌ఫీల్డ్ గ్లోబల్ స్కూల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. చదువుల కోసం విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా దేశంలోనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యా సంస్థలు వస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రపంచంలో ఎక్కడ మంచి విద్యా సంస్థ ఉన్నా, మన దేశానికి పిలుస్తామన్నారు. భారతదేశ యువత ప్రపంచాన్ని శాసించే పరిస్థితి రావాలని కిషన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఏవీఎన్ విద్యా సంస్థల చైర్మన్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



నాగోల్ లోని పిబిఆర్ కన్వెన్షన్ హాల్లో జరిగిన పారేపల్లి అనురాధ-సురేష్ ల కుమార్తె అనుపమ- శివసాయిరాంల వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రికల చైర్మన్ డా.కాచం సత్యనారాయణ-సుష్మ దంపతులు. ఈకార్యక్రమంలో కాచం నర్సింహులు, చైతన్య, సత్యనారాయణ, జ్యోతి, వీ3 న్యూస్ చీఫ్ ఎడిటర్ భరత్ రెడ్డి, కిషోర్, మనోహర్ పాల్గొన్నారు.

సంగారెడ్డి నియోజకవర్గం లో ఎక్కడా తాగు నీటి సమస్య రావద్దు

- తాగునీటి సమస్యపై సమీక్ష సమావేశంలో జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి

విశ్వంభర, సంగారెడ్డి : సంగారెడ్డి నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, రెండు మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్యలపై జగ్గారెడ్డి రెడ్డి , నిర్మల జగ్గారెడ్డి మిషన్ భగీరథ, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో రామ్‌నగర్‌లోని వారి నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకూడదని అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధుల ద్వారా సమస్యలను వివరంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ మరియు శాశ్వత చర్యలు తీసుకోవాలని సూచించారు.తాగునీటి సరఫరా కోసం తక్షణ అవసరాల నిమిత్తం ₹71 లక్షలు, మిషన్ భగీరథ పనుల కోసం ₹3.70 కోట్ల ప్రతిపాదనలు అధికారులు సమర్పించారు. అవసరమైన నిధుల కోసం కలెక్టర్ ,ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో వెంటనే కొత్త బోర్లు వేయించి సరఫరా మెరుగుపరచాలని ఆదేశించారు. మిషన్ భగీరథ మరియు మున్సిపల్ అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించాలన్నారు. తాగునీరు అత్యవసర అంశమని, ఈ విషయంలో అధికారులు ఆలస్యం చేయకుండా స్వయంగా నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు.మండలాల వారీగా కంది, సంగారెడ్డి, కొండాపూర్, సదాశివపేట ప్రాంతాల్లో పైప్‌లైన్ మరమ్మతులు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంప్ నిర్మాణం, బోర్లు, మోటార్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. సదాశివపేట మున్సిపాలిటీలో నీటి సరఫరా సమస్యలు, డ్రై అయిన బోర్ల పరిస్థితిపై చర్చించి, అవసరమైన చోట్ల వెంటనే బోర్లు వేయాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసరంగా బోర్ మరియు మోటార్ ఏర్పాటు చేయాలని సూచించారు. సంగారెడ్డి మున్సిపాలిటీ కి మిషన్ భగీరథ నుండి ప్రతీ రోజూ 2 ఎంఎల్డీ నీరు తక్కువగా వస్తుందని దీంతో అన్ని వార్డుల్లో పూర్తి స్థాయిలో నీటి సరఫరా చేయలేక పోతున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కూన సంతోష్‌లు జగ్గారెడ్డి కి వివరించారు. మిషన్ భగీరథ నుండి బల్క్ వాటర్ సప్లై పెంచాలని కోరారు. మిషన్ భగీరథ నుండి వచ్చే నీటి పరిణామం కొలిచేందుకు ఫ్లో మీటర్ ను వెంటనే ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారుల ను జగ్గారెడ్డి ఆదేశించారు. తాగు నీరు అనేది అత్యవసరం అని ఈ విషయంలో అధికారులు సత్వర నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సంగారెడ్డి మున్సిపాలిటీ లో తాను తెచ్చిన మంజీరా వాటర్ స్కీమ్ ను గత పదేళ్ల కాలంలో నాశనం చేశారని అందుకే ఈ సమస్యలు వస్తున్నాయని జగ్గారెడ్డి తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీ పిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్ ,సత్యనారాయణ, చిరు, నర్సింహా రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి , సదాశివ పేట, సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ లు, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు దండు శేఖర్ శనివారం మరణించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వచ్చి తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు.

పేటలో పలు శుభాకార్యాలకు హాజరైన మాజీ మంత్రి జగదీష్ రెడ్డి

విశ్వంభర, సూర్యాపేట: సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం రోజున జరిగిన పలు శుభకార్యాలకు మాజీ మంత్రివర్యులు సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లలమర్రి రోడ్డు సమీపంలో రుద్రంగి మంజుల సురేష్ లు నూతనంగా నిర్మించిన రుద్రంగి కన్వెన్షన్ ను ప్రారంభించారు. అలాగే విద్యానగర్లో ఈగ వెంకటేశ్వర్లు పద్మావతి ల నూతన గృహప్రవేశ వేడుకకు హాజరయ్యారు.అనంతరం జనగాం క్రాస్ రోడ్ లో గల మన్నెం సదాశివరెడ్డి ఫంక్షన్ హాల్ లో జరిగిన ఆవు దొడ్డి శ్రీను యాదవ్ నాగమ్మల కుమారుడు ఆవుదొడ్డి ప్రవీణ్ శ్రావణి ల వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

రాహుల్‌తో కలిసి కేరళలో పొంగులేటి ప్రచారం..

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : కేరళంలో ఈ సారి రాజకీయ మార్పు అనివార్యమని, ప్రజలు ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. యూడీఎఫ్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజార్టీతో అధికారంలోకి వస్తుందన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. కేరళం ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం అలెప్పి నియోజకవర్గం మన్నన్‌చెరీ పంచాయతీలోని కవుంకల్‌లో జరిగిన ఎన్నికల ప్రచారసభలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీతో కలిసి మంత్రి పొంగులేటి స్థానిక అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అవకాశం ఇస్తే తెలంగాణలో అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ మోడల్‌ను అక్కడ కూడా అమలు చేస్తామని, తెలంగాణలో అమలు చేస్తున్నట్లే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కేరళంలో కూడా ప్రవేశపెడతామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. కేరళంలో ఉన్న సీపీఎం ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కన పెట్టి, బీజేపీని కౌంటర్ చేయడం పేరుతో రాజకీయ నాటకాలు ఆడుతోందని మంత్రి విమర్శించారు. ఈ రెండు పార్టీలు కలిసి ప్రజల దృష్టిని సమస్యల నుంచి మళ్లిస్తున్నాయని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ఉద్యోగాల కొరత, ధరల పెరుగుదల వంటి ప్రధాన సమస్యలను పక్కనపెట్టి, రాజకీయ ఆరోపణలతో కాలక్షేపం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కేరళ ప్రజలు ఇప్పటికే సీపీఎం ప్రభుత్వంపై విసుగు చెందారని, ఈ ఎన్నికల్లో మార్పు కోసం ఓటు వేయాలని ఓటర్లు నిర్ణయించుకున్నారని మంత్రి తెలిపారు. ప్రజలకు పారదర్శకత, అభివృద్ధి, సంక్షేమం అందించగల శక్తి కాంగ్రెస్ పార్టీకే ఉందని, కేరళంలో యూడీఎఫ్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి: చెరుకు నాగభూషణం

విశ్వంభర, ఎల్బీనగర్ : వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని చెరుకు నాగభూషణం అన్నారు. శనివారం కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు సాధన సమితి ఆధ్వర్యంలో చైతన్యపురి లోని ఎలిమినేటి మాధవరెడ్డి కమ్యూనిటీ హాల్ లో వికలాంగుల అన్ని సంఘాలతో ముఖ్య సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు ఇచ్చిన వికలాంగుల పెన్షన్లు 6000 ,సామాజిక పెన్షన్లు 4000, తీవ్ర వైకల్యం గల దివ్యాంగుల పెన్షన్లు 15000 పెంపు, అన్ని రకాల ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా, ప్రభుత్వ అన్ని శాఖల సంస్థలలో వికలాంగుల రిజర్వ్ ఉద్యోగాల భర్తీ, వికలాంగుల హక్కుల చట్టం కచ్చితంగా అమలు హామీలు అమలు చేయనందుకు నిరసనగా మే 2 తారీఖున అన్ని మండల స్థాయి నిరసన కార్యక్రమాలు 22 తారీఖున 119 నియోజకవర్గ స్థాయి నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలని పిలుపునివ్వడం జరిగింది.రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా శ్రీధర్ బాబు మేనిఫెస్టో కమిటీ చైర్మన్ గా తెలంగాణలోని అన్ని రకాల వికలాంగుల సంక్షేమ అభివృద్ధికి అవసరమైన చర్యలు భాగంగా మేనిఫెస్టో రూపకల్పనలో వికలాంగులకు సంబంధించిన పై డిమాండ్లను చేర్చడం జరిగింది.రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టి మూడు సంవత్సరాలు కావస్తున్న నేటికీ ఈ అంశాల అమలుకు ప్రయత్నం చేయకపోవడం దుర్మార్గమైన చర్య భావిస్తున్నాం. కార్యక్రమంలో కొల్లి నాగేశ్వరరావు, ఆంజనేయులు గౌడ్, చిత్రం కృష్ణ, రాజ్యలక్ష్మి, ధనమ్మ ,మాధవి, మారవేణి ,చంద్రశేఖర్ యాదవ్, వేణు గౌడ్, మరుగుజ్జు మల్లేష్ ,సైదులు, అశోకు, వెంకటేష్, అశోక్ ముదిరాజ్ దివ్యంగా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీఐడీ విచారణకు హాజరైన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

విశ్వంభర, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సీఐడీ విచారణకు హాజరయ్యారు. ఈ ఏడాది జనవరి 29న హుజూరాబాద్‌లో సమ్మక్క జాతర వేళ గొడవ చోటుచేసుకుంది. పోలీసుల విధుల్లో అడ్డంకి, దూషణలు, మతవిద్వేష వ్యాఖ్యలు చేసినట్లు కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు అయింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి అప్పగించింది. కౌశిక్‌రెడ్డితో పాటు ఆయన భార్య శాలినిరెడ్డి హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయానికి వచ్చారు.